పల్లె దవాఖాన ప్రారంభం

దవాఖానను ప్రారంభిస్తున్న పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేటరూరల్, డిసెంబర్12: పేట మండలంలోని జాజాపూర్ గ్రామంలో నిర్మించిన పల్లెదవాఖాన భవనాన్ని మంగళ వారం పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సర్పంచ్ కోట్ల సుగందమ్మ జగన్మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. బయట చిరుతిండ్ల వల్ల అనేక రోగాలను కొనితెచ్చు కొంటున్నామని వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఆరు నెలల కోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్య క్రమంలో డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మీ, మెడికల్ ఆఫీసర్ నర్సింగ్ రావు, ఎంపీడీవో వెంకటయ్య, ఎంపీటీసీ శేఖర్, వైద్యురాలు శృతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్‌ఎం లక్ష్మిదేవమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఐటీ సోదాలు

పెబ్బేరు, డిసెంబరు 12: మండలంలోని రంగాపురంలోని ఏబీడీ లిక్కర్ కంపెనీలో రెండో రోజూ మంగళవారం ఆదాయపు పన్ను అధికారుల సోదాలు కొనసాగాయి. ముంబాయి కేంద్రంగా ఐటీ శాఖ దేశంలోని అన్ని మద్యం తయారీ కంపెనీల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. ఒడిసాలోని కాంగ్రెస్ ఎంపీ ఇంట్లో దొరికిన నోట్ల కట్టల వ్యవహారం మద్యం కంపెనీలకు ముడి పడి ఉండటంతో రంగాపురంలోని అల్లైడ్ బ్లెండర్స్ డిస్టిలరీస్ కంపెనీలోనూ సోమవారం తెల్లవారుజాము నుంచి ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తు న్నారు.

ఉపాధిపనులపై సామాజిక తనిఖీ

గోపాల్‌పేట, డిసెంబర్ 12 : మండలంలోని ఆయా గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 1.4.2022 నుంచి 31.3.2023 తేదీ వరకు జరిగిన ఉపాధి పనులపై మంగళ వారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ అడ్డాకుల సంధ్య అధ్యక్షతన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల నివేదికను సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదికలో చదివి వినిపించారు. కూలీలకు చెల్లించిన డబ్బులు, పనులకు సంబంధించిన తేడాలను గుర్తించి ప్రజా వేదికలో నివేదించి సంబంధిత సిబ్బంది నుంచి రూ. 23,723 రికవరీ చేయాలని ప్రిసైడింగ్ అధికారి (డీఆర్‌డీవో) నర్సింహులు అదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంద భార్గవి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు ఎండీ.మతీన్, ఎంపీడీవో హుస్సేనప్ప, ఏపీవో నరేందర్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి

నారాయణపేట, డిసెంబర్ 12: యాసంగి పంట సాగుకు పట్టణంలోని కొండారెడ్డిపల్లి చెరువు ఆయకట్టు కింద పొలాలకు నీటిని విడుదల చేయాలంటూ మంగళవారం బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు బాలప్ప ఆధ్వర్యంలో తాసీల్దార్ రాణాప్రతాప్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెరువు తూము ద్వారా పంటకు నీరందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకటప్ప, బీకేఎస్ నాయకులు మల్లప్పయాదవ్, లక్ష్మీనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉన్నత జీవితం

ఆత్మకూరు, డిసెంబర్ 12: నైపుణ్యాలు సాధిస్తేనే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాకీర్‌హుస్సేన్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని జూనియర్ కళాశాలను సందర్శించి వొకేషనల్ కోర్సు ఓజేటి (ఉద్యోగ శిక్షణ) కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే పనిలో నైపుణ్యత సాధిస్తేనే ప్రత్యేకత సాధించగలమన్నారు. అదేవిధంగా ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ తరగతులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం కళాశాల రికార్డులను పరిశీలించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బాలల హక్కుల సంరక్షణకు కృషి

ఊట్కూర్, డిసెంబర్12: సమిష్టి కృషితోనే బాలల హక్కుల సంరక్షణ సాధ్యమవుతుందని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా సమన్వయకర్త నర్సింహులు అన్నారు. మంగళవారం నిడుగుర్తి యూపీఎస్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, దేశాభివృద్ధికి నేటి బాలలే రేపటి పౌరులుగా కృషి చేస్తారని తెలిపారు. 2009 విద్యాహక్కు

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

- **నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, డిసెంబర్ 12: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ వచ్చేనెల 6 నుంచి 22 వరకు 18 ఏండ్లు పూర్తయిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ప్రత్యేకంగా రెండు రోజుల పాటు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు రాలేదని ఎవరూ కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 100 ఏండ్లు పైబడిన ఓటర్లు 150 మంది ఉన్నారని, మరోసారి పరిశీలించి నిర్ధరణ చేస్తామన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1,500 మంది కన్నా ఎక్కువ ఓటర్లు ఉంటే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. పేట, మక్తల్ నియోజకవర్గాల పరిధిలో 12 కేంద్రాలు ఏర్పాటు చేయాలని పరిశీలనలో ఉందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చ న్నారు. జనవరి 6 నుంచి ప్రతి బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కొత్త ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలు పరిశీలించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్‌కుమార్, ఆర్డీవో రాంచందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం గుర్తించాలి

జిల్లాలో పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ సెంటర్‌కు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఉద్యానవన, నాబార్డ్, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే తొలిసారిగా పేట జిల్లాలో కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం కోసం 10 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించాలని అధికారులకు సూచించారు. ఉద్యానవన శాఖాధికారి సాయిబాబా మాట్లాడుతూ రైతులు బృందంగా ఏర్పడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుం టే కేంద్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీ అందజేస్తుందని, అలాగే నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కూడా పొందవచ్చన్నారు. కొల్లాపూర్ మామిడి పండ్లకు విదేశాల్లో భారీగా డిమాండ్ ఉం దని, జిల్లాలో ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే మార్కెటింగ్, విదేశా లకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమా వేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రాంచందర్, నాబార్డ్ అధికారి నిఖిల్, తాసీల్దార్లు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి

- **వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, డిసెంబర్ 12: రాబోయే గ్రామపంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితా తప్పులు లేకుండా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత భవనంలోని ప్రజవాణి హాల్లో స్పెషల్ సమ్మరి రివిజన్ 2024పై తాసీల్దార్, డీటీ , బీఎల్‌వో, సూపర్‌వైజర్లతో ఓటరు జాబితా తయారీపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ,యువకులను ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఓటరు నమోదు, తొలిగింపు, పోలింగ్ కేంద్రాల మార్పు, చేర్పులు నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకొనేందుకు ఇప్పుడు అవకాశం ఉందన్నారు. అందుకు తగ్గ ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. ఎస్ఎస్ఆర్ 2024 ప్రకారం డిసెంబర్ 20 నుంచి జనవరి 5 వరకు పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సవరించే ప్రక్రియ చేపట్టాలన్నారు. జనవరి 6న ముసాయిదా జాబితా ప్రచురించాలని, 6 వతేదీ నుంచి 22 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 2 వరకు ఫిర్యాదులు పరిష్కారించి 6 వతేదీన తుది జాబితా ప్రచురణ కోసం ఎన్నికల కమిషన్‌కు పంపించాలన్నారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితా ప్రకటించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతి రావు, తాసీల్దార్లు, డీటీలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రచారం మీద ఉన్నద్యాస ప్రజాసేవపై లేదు

- **బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్**

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి, డిసెంబర్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్తదనం లేదని, ఆ పార్టీకి ప్రచారం మీద ఉన్న ధ్యాస ప్రజాసేవ మీద లేనట్లు ఉందని బీఆర్ఎస్ బీఆర్ఎస్ వనపర్తి పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్ ఎద్దేవా చేశారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ కొత్త సీసాలో పాత మందు సామెతను తలపిస్తుందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే ఆర్భాటంగా ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో ఏ మాత్రం కొత్తదనం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రూ.15 లక్షలతో కూడిన ఆరోగ్య శ్రీ అందిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షలు, పీఎం ఆయుష్మాన్‌భవ కింద ఇస్తున్న రూ.5 లక్షలు కలిపి రూ.10 ఇస్తున్నట్లు ప్రకటించు కోవడం మందిపై సలతో మంగళహారతులు పట్టినట్లు ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం ఇచ్చే ఆయుష్మాన్ భవ పథకం కంటే కేసీఆర్ ఆరోగ్య శ్రీ వల్లనే రాష్ట్రంలోని పేద ప్రజలకు ఎక్కువ ప్రయోజనాలున్నాయన్నారు. దానికితోడు సీఎం రిలీఫ్ ఫండ్ కూడా అందించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం కోసం, నిధుల కొరతను దాచి పెట్టడానికి పాట్లు పడుతున్నదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఈ పథకాన్ని స్పష్టతతో కూడిన జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, సర్పంచ్ కోట్ల వెంకటేశ్, కౌన్సిలర్ కాయితాల లక్ష్మీనారాయణ, నాయకులు దేవర్ల నర్సింహ, ఆగుపోగు కుమార్, యుగంధర్‌రెడ్డి, బాబు నాయక్, పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి

వనపర్తి టౌన్, డిసెంబర్ 12: బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్సీలకు, ఐఈఆర్సీలకు జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15-19 సంవత్సరాల పిల్లలు బడి బయట ఉండే వారిని గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ తమ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఇంటింట సర్వే నిర్వహించాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరిని గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో శ్రీధర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపించాలి

నర్వ, డిసెంబర్12: బడికెడు పిల్లలను బడిలో చేర్పిం చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని సీఆర్పీలు రోజా, నర్సింహులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇటుక బట్టిల్లో పని చేస్తున్న కుటుంబాలను సందర్శించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించా రు. గద్వాల జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు గు ర్తించి వారిని స్థానికంగా ఉన్న పాఠశాల్లలో చేర్పించాల ని వారి తల్లిదండ్రులకు వివరించారు. మండలంలోని బ డిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు స్థానికు లు,ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు కృషి చేయాలని కోరారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

నారాయణపేట, డిసెంబర్ 12: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని ఏఎస్సై ఆంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, చదువుపై శ్రద్ధ, గోల్ సెట్టింగ్, సెల్‌ఫోన్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు, రద్దీ, నిర్మానుష్య ప్రదేశాలలో ఎవరైనా వేదింపులకు గురిచేస్తే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. పాజిటివ్ ఆలోచనతో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో జీసీడీవో పద్మనళిని, ప్రిన్సిపాల్ దేవసేన, కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్వేత, కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా షీ టీం పోలీసులు పట్టణంలోని బస్టాండ్‌లో ప్రయాణికులు, విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, అపరిచిత వ్యక్తుల పట్ల వ్యవహరించాల్సిన తీరు, దొంగతనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీదేవి, బాలరాజు, పీసీ హన్మంతు, సమీనా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదలైన అరాచకాలు

వనపర్తి,డిసెంబర్ 12:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అరాచకాలు మొదలయ్యాయని, న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన గిరిజనుడిని ప్రాణం తీశారని గిరిజన నాయకుడు జాత్రునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక గిరిజనుడు లాకప్ డెత్ కావడాన్ని బీఆర్ఎస్ గిరిజన విభాగం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అన్నదమ్ముల మధ్య భూ వివాదంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఇరువర్గాలకు సమన్వయం చేయాల్సిన ఎస్సై కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి వల్ల సూర్యనాయక్ అనే వ్యక్తిని అకారణంగా కొట్టడం వల్ల దెబ్బలకు తట్టుకొలేక మృతి చెందాడన్నారు. గిరిజనుడి మృతికి కారణమైన ఎస్సైని ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసిఎస్టీ,ఎస్సీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూర్యనాయక్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయంతో పాటు 5 ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, శ్రీను, సర్పంచ్ మురళీ, గౌడ్‌నాయక్, రమేశ్‌నాయక్, శంకర్‌బాబు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆత్మకూరు, డిసెంబర్ 12: పట్టణంలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ షాపు ఎదుట గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. ఆయన కథనం మేరకు షాపు యజమాని మధు మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా గుర్తు తెలియని వ్యక్తి పడుకొని ఉన్నాడని ఎంత లేపినా లేవకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. దీంతో పోలీసులు వచ్చి మృతి చెందినట్లు గుర్తించారు.